ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



సిద్దిపేట

5

బుధవారం 8 మే 2024




ఓటేసిన ఎస్పీ

సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- సిద్దిపేట క్రైం, మే 7

బీడీ, చేనేత కార్మికులకు అండగా రాహుల్, రేవంత్

- దుబ్బాకలో నీలం మధుకు 50 వేల మెజారిటీ ఇవ్వండి
- కొత్త రెవెన్యూ డివిజన్ సాధ్యం చేస్తాం
- ఈ హామీలకు నాది గ్యారంటీ
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



దుబ్బాకలో రోడ్‌షోలో అభివాదం చేస్తున్న జగ్గారెడ్డి

దుబ్బాక, మే7: బీడీ కట్టలపై బొమ్మ పెట్టిందే బీజేపీ పార్టీయని, బీడీ, చేనేత కార్మికులకు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉండి ఆదుకుంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. దుబ్బాక ఎంపీగా ప్రభాకర్‌రెడ్డి పదేళ్లు ఉన్నా ఏనాడు బీడీ కార్మికులను ఆదుకోలేదన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాగానే, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా చూస్తానని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా జగ్గారెడ్డి మంగళవారం దుబ్బాకలో బైక్‌ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. దుబ్బాకలో కొత్తప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే అయినా కూడా చెరుకు శ్రీనివాస్‌రెడ్డినే పనులు చేయాలన్నారు. దుబ్బాక అభివృద్ధి దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డితోనే జరిగిందన్నారు. అలాంటి నాయకుడి కుమారుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని దుబ్బాక ప్రజలు ఎలా ఓడించారన్నారు. 20 ఏళ్ల క్రితం తాను సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో రాష్ట్ర నిధులన్నీ దుబ్బాకకే వచ్చేవని గుర్తుచేశారు. ఎన్నోసార్లు జడ్పీ సమావేశంలో కేసీఆర్, ముత్యంరెడ్డి మధ్య నిధుల కేటాయింపు విషయంలో కొట్లాట జరిగేదన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు కూడా అన్ని నిధులను దుబ్బాకకు తీసుకుని పోతున్నావనేవాడని, అలాంటి మంచి నాయకుడి కుమారుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని సమయంలో దుబ్బాకలో రోడ్లన్నీ అభివృద్ధి జరిగాయని, ప్రస్తుతం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. దుబ్బాక నుంచి నీలం మధుకు 50వేల మెజారిటీ ఇస్తే, శ్రీనివాస్‌రెడ్డి తిరిగి అభివృద్ధి చేస్తారన్నారు. దుబ్బాక అభివృద్ధి తన గ్యారంటీ అని స్పష్టం చేశారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్ కూడా తానే శ్రీనివాస్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి చేయిస్తానన్నారు. ఇప్పుడు శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గరి వ్యక్తి అని, ఇంకా పదేళ్లు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డినేన్నారు. ఐదేళ్లు కేసీఆర్, హరీశ్ రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఏమీ చేయలేదన్నారు. అందుకే ఈసారి దుబ్బాక ప్రజలు, వ్యాపారులు, విద్యావేత్తలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన సూచించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఏం సక్కనోడని ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. తాను 40 ఏళ్ల నుంచి సంగారెడ్డిలో సీతారాముల కల్యాణోత్సవం చేస్తున్నానని, ఈబీజేపీ వాళ్లు కనీసం గుడికి పోయి కొబ్బరికాయ కూడా కొట్టరన్నారు. అందరం రోజు పూజ చేస్తామని, బీజేపీ వాళ్లు కనీసం దేవుడిని మొక్కకుండా చేస్తున్నారన్నారు. రఘునందన్‌రావు గెలిచి కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చారా? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. దుబ్బాక అభివృద్ధిపై, బీడీ, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తనదే గ్యారంటీ అని చెప్పారు. ఇక కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ప్రతి సమస్య వివరించాలని, దుబ్బాక నుంచి 50 వేల మెజారిటీ తెప్పించాలన్నారు. దుబ్బాక నుంచి అనుకున్నంత మెజార్టీ తెస్తేనే, సీఎం వద్దకు వెళ్లి నిధులు సాధించగలుగుతామన్నారు. దుబ్బాక ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు గాల్‌రెడ్డి, తదితరులున్నారు.

నీలం మధుకు 30వేల మెజారిటీ ఇస్తే సంగారెడ్డిలో రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి

- మినీ ట్యాంక్‌బండ్‌కు రూ. 500 కోట్లు
- రూ.12 కోట్లతో రాజీవ్‌పార్కు అభివృద్ధి
- సీఎం దగ్గర కూర్చుని మంజూరు చేయిస్తా
- సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు జగ్గారెడ్డి విజ్ఞప్తి



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే7: పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 30వేల ఓట్ల మెజారిటీ ఇస్తే సంగారెడ్డి నియోజకవర్గంను రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం ప్రకటన రూపంలో, సోషల్ మీడియా ద్వారా ప్రచారంలోకి తీసుకువచ్చారు. సంగారెడ్డిలోని ట్యాంక్‌బండ్‌ను రూ.500 కోట్లతో సుందరీకరణ చేయిస్తానని పేర్కొన్నారు. రాజీవ్‌పార్కును రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తానని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులకు శ్మశానవాటికల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు.

బండ్లబాటల్లో పక్కా రోడ్ల నిర్మాణం

రైతుల కోసం గ్రామాల్లో బండ్ల బాటలన్నింటిలో పక్కా రోడ్ల నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. చెరువులన్నింటినీ రూ. 100 కోట్లతో అభివృద్ధి చేయిస్తానని ప్రకటించారు. స్వయం సహాయక సంఘాలకు, అంగన్‌వాడీ భవనాలు, ప్రహరీ నిర్మిస్తాపన్నారు.

సదాశివపేటకు తాగునీటి కోసం ప్రత్యేక స్కీం

సదాశివపేట మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక పథకం మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. మంజీర బ్యారేజీ నుంచి నేరుగా సదాశివపేట పట్టణ ప్రజలకు నీరందించేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. సదాశివపేటలోని 26 వార్డులలో సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్స్ నిర్మిస్తామని పేర్కొన్నారు.

ఓట్ల కోసం ఉత్సవాలు చేయను

సంగారెడ్డిలో 25 సంవత్సరాల నుంచి తాను సీతారామ కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఓట్ల కోసం ఇది చేయడం లేదని, దేవుడి కోసం చేస్తున్నానని అన్నారు. దేవుడిని రాజకీయాలలోకి తీసుకురావడం తనకు ఇష్టం లేదన్నారు.

మెజారిటీ ఇస్తే సీఎం దగ్గర కూర్చుంటా

తనను ఓడించినా ఫరవాలేదని కానీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి 30వేల మెజారిటీ ఇస్తే అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం సీఎం దగ్గర కూర్చుంటానని జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డిటౌన్‌లో 40వేల ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చేలా చూడాలని కార్యకర్తలను కోరారు. బీజేపీ మనకు పోటీయే కాదని, బీఆర్ఎస్‌తో ఉండే పోటీలో మనమే పైచేయిగా నిలవాలన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే జూన్ 15 నుంచి తాను అభివృద్ధి పనుల ప్రక్రియను ప్రారంభింపజేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు అయినా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు.

ప్రశాంతంగా ఎంసెట్

- తొలి రోజు 13 మంది గైర్హాజరు
- ఆలస్యంగా రావడంతో ఇద్దరికి నో ఎంట్రీ
- ఈ నెల 11 వరకు పరీక్షలు

సిద్దిపేట క్రైం, మే 7: సిద్దిపేటలో పట్టణ శివారులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరిగాయి. ఉదయం పూట 90మంది విద్యార్థులకు గాను 82 మంది హాజరుకాగా 8 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 90మంది విద్యార్థులకు గాను 85మంది హాజరుకాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఉదయం పూట పరీక్ష సమయానికి ఆలస్యంగా రావడంతో ఇద్దరు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించలేదు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఉండడంతో పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచే విద్యార్థులను అనుమతించారు. ఎంసెట్ పరీక్షలు ఈ నెల 11వరకు జరగున్నాయి.



విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న సిబ్బంది



ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో గేటు బయటే ఆపేసిన సిబ్బంది





సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో కొట్టుకుపోయిన ధాన్యం, హుస్నాబాద్‌లో తడిసిన ధాన్యం

అకాల వర్షం.. ఆగమాగం

- ఈదురుగాలులకు కూలిన చెట్లు, స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- తడిసిన ధాన్యం, నేలరాలిన మామిడికాయలు

కొండపాక/నంగునూరు/హుస్నాబాద్‌రూరల్/మద్దూరు/దుబ్బాక/మిరుదొడ్డి /ములుగు /కుకునూరుపల్లి /చేర్యాల/ సిద్దిపేట అగ్రికల్చర్, మే 7: అకాల వర్షం రైతులను ఆగమాగం చేసింది. ఎండలతో అల్లాడుతున్న జనం మంగళవారం కురిసిన వర్షానికి కాస్త సేదతీరినా.. రైతులకు మాత్రం నష్టాన్నే మిగిల్చింది. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో రేకులషెడ్డు కొట్టుకుపోయింది. కొండపాక మండల కేంద్రంతో పాటు దమ్మకపల్లి, మర్పడగ తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోయాయి. ఈదురుగాలులతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నంగునూరు మండలంలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దయింది. మామిడికాయలు నేలరాలాయి. వెంకటాపూర్ కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. పాలమాకుల నుంచి ఓబులాపూర్ వెళ్లే దారిలో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా కూలిపోయాయి. ముండ్రాయిలో పశువుల కొట్టం కూలిపోయింది. అక్కెన్నపల్లి, గట్లమల్యాల నంగునూరు, వెంకటాపూర్, నర్మెట, ముండ్రాయి, గ్రామాల్లో అపార పంట నష్టం జరిగింది. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో కరెంట్‌కు అంతరాయం ఏర్పడింది. ముండ్రాయిలో పట్టుపురుగుల షెడ్డు కూలిపోవడంతో పురుగులు చనిపోయాయి. గాలివానకు దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని పలుగ్రామాల్లో, అలాగే హుస్నాబాద్ మార్కెట్ యార్డులోని కుప్పలపై ఉన్న టార్పాలిన్ కవర్లు లేచిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. వర్షానికి ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందారు. గాలివానకు విద్యుత్‌వైర్లు తెగిపోవడంతో పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంకు హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ ప్రధాన రహదారి జలయమంగా మారింది. మహ్మదాపూర్, నాగారం, పోతారం(ఎస్), జిల్లెలగడ్డ, మీర్జాపూర్, ఉమ్మాపూర్ గ్రామాల్లో మామిడితోటలు దెబ్బతిన్నాయి. మద్దూరు గ్యాస్ గోదాం సమీపంలోని చెట్లు కూలాయి. ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు మండలంలోనూ పలుచోట్ల చెట్లు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చేర్యాల పట్టణాన్ని కారుమబ్బులు కమ్మేశాయి. ఆకాశంలో దట్టంగా మేఘావృతమై సాయంత్రం 4-30గంటలకే చిమ్మచీకటిమయంగా మారింది. బలమైన ఈదురుగాలులకు తోడు వర్షం కురిసింది. చేర్యాల మండలం వీరన్నపేటలో గాలివాన బీభత్సానికి కమ్మకోలు రాజు ఇంటి పైకప్పు కూలింది. చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ధాన్యం తడిసింది.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



మృతిచెందిన మల్లేశం

కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన కుమ్మరి మల్లేశం(36) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం గేదెకు పాలు పితకడానికి పొలం వద్దకు వెళ్లాడు. అప్పుడే వర్షం కురవడంతో పక్కనే ఉన్న వేపచెట్టు కిందకు వెళ్లగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

కొమురవెల్లి మండలం గురువన్నపేటలో పుట్ట కనకయ్య వ్యవసాయ బావి వద్ద పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. కుకునూరుపల్లి మండలం మదినిపూర్ గ్రామానికి చెందిన డాకూరి నారాయణ పాడి గేదే మంగళవారం ఉదయం పిడుగుపాటుకు మృతిచెందింది.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

అకాల వర్షంతో తడిచిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవేంద్రసింగ్ చౌహాన్ తెలిపారు. కొండపాక మండలం దుద్దెడ, కొమురవెల్లి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎలాంటి అనుమానం పడాల్సిన అవసరం లేదని కచ్చితంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం డబ్బుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతులకు డబ్బులు అందించేందుకు సరిపడా నిధులున్నాయని తెలిపారు. తూకంలో గన్నీసంచీ పేరిట అదనంగా కిలో సేకరించడాన్ని వీడి గన్నీబ్యాగుతో సమతూకం పెట్టాలని ఆదేశించారు. కొమురవెల్లిలో ప్రైవేటు స్థలంలో కేంద్రం కొనసాగుతున్నందున బస్తాకు రూ.2చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వం ద్వారా చెల్లింపచేయాలని ఆదేశించారు.





మద్దూరులో రోడ్డుపై విరిగిపడిన చెట్లు, చేర్యాల మండలం వీరన్నపేటలో నేలకూలిన రేకుల ఇంటి పైకప్పు



మెదక్ కోసం



మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్, పక్కన వెంకట్రామారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

యుద్ధం చేద్దామా!

జిల్లాను రద్దు చేస్తారట..

- ప్రజల కోసమే ఏర్పాటు చేశాం
- కాంగ్రెస్ వాళ్లు వద్దంటున్నరు
- జిల్లాలో మున్సిపాలిటీలు, ఏడుపాయలకు నిధులిచ్చాం
- హల్దీవాగును మల్లన్నసాగర్‌తో అనుసంధానించాం
- ఘనపూర్ ప్రాజెక్టును అభివృద్ధి చేశాం
- మీ కోసమే వెంకట్రాంరెడ్డిని మెదక్ ఎంపీగా పోటీ చేయమన్నా
- దుబ్బాకలో చెల్లని రూపాయి రఘునందన్ : మాజీ సీఎం కేసీఆర్

మెదక్ మున్సిపాలిటీ, మే 7: ముఖ్యమంత్రి కొత్త జిల్లాలను తీసేస్తానని అంటున్నాడని, మెదక్ జిల్లానూ తీసేస్తారని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా ఉండాలంటే బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంట్రామారెడ్డిని గెలిపించాలి.. మెదక్ కోసం యుద్ధం చేద్దామా..? అని ప్రజలను ప్రశ్నించగా.. చేద్దామని జనం నినదించారు. మెదక్ రాందాస్ చౌరస్తాలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. విద్యావంతుడు, మెదక్‌పై ప్రేమ ఉన్నవాడు.. నా సలహాతోనే మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం కోసం తాము కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేస్తడంట అని కేసీఆర్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా ఉండాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మెదక్ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించామని తెలిపారు. మెదక్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, ఏడుపాయలకు రూ.100 కోట్లు కేటాయిస్తూ జీవోను ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. మెదక్ పట్టణంలోని 100 పడకల ఆస్పత్రిని 50 పడకలకు కుదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హల్దీవాగు మీద చెక్‌డ్యాంలు నిర్మించి మల్లన్నసాగర్‌కు అనుసందానం చేయడంతో సింగూరు ప్రాజెక్టు కళకలాడుతున్నదని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయలేని అసమర్థులు

కాగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేక అసమర్థతను నిరూపించుకుందని మాజీ సీఎం అన్నారు. రూ.4వేల పెన్షన్, రూ.15వేల రైతుబంధు వస్తుందా అని ప్రజలను ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో అరచేతిలో వైకుంఠం చూపిందని మండిపడ్డారు. ఇష్టమొచ్చిన వాగ్దానాలిచ్చి రేవంత్ సర్కార్ ఏది నెరవేర్చలేదన్నారు. కరెంట్ కోతలు... నీళ్ల రావు.. రూ.500 బోనస్ లేదు.. మద్దతు ధర ఇవ్వలేదు.. తడిసిన ధాన్యం కొనడం లేదు.. ఏ ఒక్క పథకాన్ని అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఆగమాగం జగన్నాథంలా ఈ ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేశారు.

జూటా బ్యాచ్‌కు బుద్ధి చెప్పాలి : హరీశ్‌రావు

మోసపూరిత వాగ్దానాలు చేసి.. ఎన్నికల తరువాత అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్ కార్నర్‌షోలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ జూటా బ్యాచ్‌కు గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. రూ. 4వేలు తీసుకుంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని.. మహిళలకు రూ.2,500 ఇస్తే కాంగ్రెస్ ఓటేయండని.. లేదనంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తరువాత లక్ష పెళ్లిల్లు జరిగాయని.. రేవంత్ సర్కార్ నూతన వధూవరులకు లక్ష తులాల బంగారం బాకీ పడిందని పేర్కొన్నారు. బీజేపీకి ఓటేస్తే నీళ్లు లేని బావిలో వేసిన ట్లేనని ఎద్దేవా చేశారు.

రూ.. 100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తా..

తనను ఎంపీగా గెలిపిస్తే రూ. 100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉచితంగా కల్యాణ వేదికలు నిర్మించి ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, నాయకుడు బట్టి జగపతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జన ప్రభంజనం

మెదక్ అర్బన్ : కేసీఆర్ మెదక్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు జనం పోటెత్తారు. భారీ ఎత్తున ప్రజలు తరలిరావడంతో రాందాస్ చౌరస్తా కిటకిటలాడింది. జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో మార్మోగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ అయ్యింది. కేసీఆర్ 16 నిమిషాల పాటు ప్రసంగించారు. ఆయన ప్రసంగం ఆద్యంతం చప్పట్లు, ఈలలు, కేరింతలలో జనం స్పందించారు. రైతుబంధు, మహాలక్ష్మీ, వ్యవసాయం గురించి కేసీఆర్ ప్రస్తావించిన ప్రతీసారి ప్రజల నుంచి స్పందన లభించింది.

ఈనెల 10న కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, మే 7: ఈనెల 10 సిద్దిపేటలో కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని, పార్టీశ్రేణులు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం సిద్దిపేటలోని గంగాజల్ ఎక్స్‌రోడ్డు వద్ద సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. సభకు సంబంధించిన స్టేజీ, పార్కింగ్ వసతులు తదితర వాటిపై స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు గుండు శ్రీను, రెబల్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.









సీఎం తమ్ముడితో సంబంధాలున్నాయ్..

- మాట వినకుంటే వ్యాపారాలు మూయిస్తా..
- పోలీసుల పేరు చెప్పి వసూళ్లు.. నిందితుడి అరెస్ట్

మెదక్ అర్బన్, మే 7: సీఎం తమ్ముడితో దగ్గరి సంబంధాలు ఉన్నాయి.. మాట వినకుంటే వ్యాపారాలు మూయిస్తా.. నా వెనుక పోలీసులు, ఎమ్మెల్యే ఉన్నారంటూ వసూళ్లకు పాల్పడ్డాడు. ఏకంగా లాఠీ పట్టుకుని వాహనాలను వెంబడించి మరీ వసూళ్లకు తెగబడ్డాడు. ఈ మేరకు ఫిర్యాదులు అందడంతో మెదక్ పోలీసులు నిందితుడికి అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపించారు. మంగళవారం సీఐ దిలీప్‌కుమార్ మెదక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. మెదక్ పట్టణంలోని ఇందిరాపూరి కాలనీకి చెందిన ఆముదా రఘు తన వెంట పోలీసులు, ఎమ్మెల్యే ఉన్నారని చెబుతూ వ్యాపారులతో పాటు, ఇసుక వ్యాపారులను బెదిరిస్తున్నాడు. లాఠీ పట్టుకుని వాహనాలను వెంబడించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇసుక దందా చేయవద్దని సీఎం చెప్పారని, సీఎం, అతని తమ్ముడితో దగ్గర సంబంధాలు ఉన్నాయంటూ బెదిరించాడు. ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లను సేకరించి వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి వారి పేర్లు చెబుతూ.. అధికారులకు ఫోన్లు చేస్తున్నట్లు నటిస్తూ.. బెదిరించేవాడు. తన మాట వినకుంటే వ్యాపారాలు మూసి వేయిస్తానని.. తన మాట వినని వారిపై తప్పుడు ఫిర్యాదులు చేసేవాడు. ఈ మేరకు ఫిర్యాదులు అందడంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యాచార కేసు, హవేళిఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దోపిడీ కేసు, మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు కేసులు ఉన్నాయని సీఐ వివరించారు. వివిధ కేసుల్లో శిక్షలు కూడా పడినప్పటికీ తీరు మార్చుకోకుండా డబ్బులు వసూలు చేస్తున్నాడని వివరించారు.


నిందితుడిని చూపుతున్న మెదక్ పట్టణ సీఐ దిలీప్‌కుమార్

కాంగ్రెస్ గెలుపు ఖాయం

- రేవంత్‌రెడ్డిది సమర్థవంత పాలన
- 8న నర్సాపూర్ బహిరంగ సభకు రాహుల్‌గాంధీ
- ఏఐసీసీ మెదక్ పార్లమెంటు పరిశీలకుడు కె.సురేష్

నర్సాపూర్, మే 7: తెలంగాణలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని కేరళ రాష్ట్రానికి చెందిన సీనియర్ ఎంపీ, ఏఐసీసీ మెదక్ పార్లమెంటు పరిశీలకుడు కె.సురేష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, సమర్థవంతంగా పాలన అందిస్తున్నారన్నారు. ప్రజలు ఎంపీ ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలు గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తన పరిశీలనలో తెలిసిందన్నారు. మెదక్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదని, ఈ స్థానం గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎంపీగా బాధ్యతలు నిర్వహించిన స్థానం అని గుర్తుచేశారు. ఈ నెల 8న నర్సాపూర్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభకు జాతీయ నేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారని తెలిపారు. సభకు లక్ష మంది హాజరవుతారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, ఎంసీ మాజీ చైర్మన్ హంసిబాయి, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మణిదీప్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సోదాలు


రామాయంపేటలో సోదాలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రామాయంపేట, మే 7: మెదక్ జిల్లా రామాయంపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి రెండు గంటల పాటు కార్యాలయంలో అణువణువూ గాలించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సమయంలో నగదు ఏమైనా ఉండవచ్చన్న సమాచారంతో ఈ సోదాలు చేసినట్లు తెలుస్తోంది. స్థానిక సీఐ వెంకట్, ఎస్ఐ రంజిత్ సైతం సోదాలు చేపట్టారు.



ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య


మహ్మద్ సోహెల్ (ఫైల్)

మనోహరాబాద్, మే 7: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కరుణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సోహెల్(24) ఆటో నడుపుకుండూ జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు సంవత్సరాల నుంచి ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరికీ పెళ్లి చేద్దామని సోహెల్ తల్లితండ్రులు సదరు యువతి తల్లితండ్రులను అడిగారు. దానికి వారు అంగీకరించకుండా ఇటీవలే వేరే వ్యక్తితో తమ కూతురి నిశ్చితార్థం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన సోహెల్ సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతుడి తండ్రి మహ్మద్ పాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకిన తల్లి.. రక్షించిన కుటుంబీకులు

శివ్వంపేట, మే 7: కన్న కుమారులు అన్నం పెట్టడం లేదని మనస్తాపానికి గురైన ఓ తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. కుటుంబీకులు కాపాడారు. ఈ సంఘటన మంగళవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబ్‌పేట్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నవాబ్‌పేట్‌కు చెందిన షేరివాణి కృష్ణమ్మ(70)కు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారు ఆమెను సరిగా చూసుకోకపోవడంతో మనోవేదనకు గురైన కృష్ణమ్మ మంగళవారం గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన గ్రామస్థులు కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు వృద్ధురాలిని నీటిలో నుంచి బయటకు తీశారు.

6 బెల్ట్ షాప్‌లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- 135.605 లీటర్ల మద్యం సీజ్

సంగారెడ్డి క్రైం, మే 7: స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో మంగళవారం దాడులు నిర్వహించి, మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. కోహీర్ మండలం మద్రి గ్రామానికి చెందిన ఈడ్గి కిషోర్‌గౌడ్ తన కిరాణ షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 20.35 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో అందూరి అశోక్‌గౌడ్ కిరాణ షాప్‌లో నిల్వ ఉంచిన 74.46 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. సదాశివపేట మండలం మద్దికుంటలో గంగెడు శ్రీనివాస్ తన కిరాణ షాప్‌లో నిల్వ ఉంచిన 10.89 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన మ్యాతరి రాజు జహీరాబాద్ అల్లానా కంపెనీ ఎదురుగా నడుపుతున్న కిరాణ షాప్‌లో 9.47 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారానికి చెందిన ఈదులకంటి శ్రీశైలం తన కిరాణ షాప్‌లో నిల్వ ఉంచిన 13.77 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే రుద్రారానికే చెందిన వడ్ల సత్యం కిరాణ షాప్‌లో 6.660 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు.

పన్ను చెల్లించని సిగరెట్ ప్యాకెట్ల అమ్మకం

- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సిద్దిపేట క్రైం, మే 7: ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా సిగరెట్ ప్యాకెట్లను తక్కువ రేటుకు తెచ్చి, ఎక్కువ రేటుకు అమ్ముతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట పట్టణం పాత బస్టాండ్ వద్ద ఉన్న హరిహరా స్టోర్స్‌లో గూడ శ్రీనివాస్, నర్సాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలోని కిరాణా దుకాణం లక్ష్మి స్టోర్‌లలో సురేష్ ఆ సిగరెట్లను అమ్ముతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట వన్, టూ టౌన్ పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రూ.1,30,000 విలువ గల సిగరెట్ డబ్బాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.


సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు





బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఇస్త్రీ చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కుమారుడు భరధ్వాజరెడ్డి



బొల్లారం మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న వెంకట్రామారెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ



మనోహరాబాద్: కాళ్లకల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వెంకట్రామారెడ్డి అన్న కుమారుడు సుజిత్‌రెడ్డి

ప్రజలకు సేవ చేసే నాయకుడినే గెలిపించండి

- మతం, కులం పేరుతో వచ్చే వారిని నమ్మొద్దు
- సిద్దిపేటను అగ్రభాగాన నిలిపిన హరీశ్‌రావు
- కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామారెడ్డికి ఇక్కడి ప్రజల సమస్యలు తెలుసు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తనయుడు భరధ్వాజరెడ్డి

సిద్దిపేట టౌన్, మే 7: ప్రజలకు సేవచేసే నాయకుడిని మీరంతా గెలిపించుకోవాలని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తనయుడు భరధ్వాజరెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని లాల్‌కమాన్ వద్ద తండ్రి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించి, మాట్లాడారు. సిద్దిపేట పట్టణంలో బీఆర్ఎస్‌కు ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు. సిద్దిపేటను మంత్రి హోదాలో హరీశ్‌రావు, అధికారి బాధ్యతలో మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి కీలకపాత్ర పోషించి, దేశ, రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిపినట్లు చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట పట్టణాన్ని దేశంలో, రాష్ట్రంలో రోల్ మోడల్‌గా నిలిపినట్లు కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోటీచేస్తున్న అభ్యర్థులను పరిశీలించి ఓట్లు వేయాలని కోరారు. మతం పేరుతో బీజేపీ అభ్యర్థి, కులం పేరుతో కాంగ్రెస్ అభ్యర్థి చేస్తున్న మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. అధికారిగా నా తండ్రి ప్రజలకు సేవ చేశారని, ఎంపీగా ఆయనను గెలిపించాలని కోరారు. కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామారెడ్డికి ఇక్కడి ప్రజల సమస్యలు తెలుసని, వాటన్నింటిని పరిష్కరించుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడాల శ్రీకాంత్, నటరాజ్, బచ్చు రమేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రయోజనాలు

జిన్నారం, మే 7: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి సతీమణి ప్రణీతారెడ్డి, ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ అన్నారు. మంగళవారం బొల్లారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి సతీమణి ప్రణీతరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి యాదమ్మతో పాటు తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేష్‌యాదవ్, సింధూఆదర్శరెడ్డి, గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణాప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌కు ఓటేయాలి

సిద్దిపేట అర్బన్, మే 7: అభివృద్ధికి పట్టం కట్టాలంటే బీఆర్ఎస్‌కే ఓటేయాలని మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ కనకమల్లయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుష్ వలి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులకు కరపత్రాలు అందజేయగా.. సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు.

కాళ్లకల్ గ్రామంలో..

మనోహరాబాద్, మే 7: మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్ గ్రామంలో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామారెడ్డి అన్న కుమారుడు సుజిత్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్ పట్టణంలో...

గజ్వేల్, మే 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో టీఎస్ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ దుంబాల అరుణాభూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ బాలమణి, మాజీ కౌన్సిలర్ స్రవంతి, మంజుల, రజియా తదితరులున్నారు.



చిన్నకోడూరు మండలం రామంచలో ఉపాధిహామీ కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న శ్రీనివాస్, తదితరులు



గజ్వేల్ పట్టణంలోని 13వ వార్డులో ప్రచారం చేస్తున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

చిన్నకోడూరు, మే 7: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రామంచ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 1,557 కేసులు

- డిప్యూటీ కమిషనర్ హరికిషన్



ఖేడ్‌లో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్

నారాయణఖేడ్, మే 7: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.8.89 కోట్ల విలువైన అక్రమ మద్యం, కల్లు, నాటుసారా, గంజాయి, తదితర పదార్థాలను స్వాధీనం చేసుకుని 1,557 కేసులు నమోదు చేసి 683 మందిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ తెలిపారు. మంగళవారం ఆయన ఖేడ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవలే పటాన్‌చెరులో రూ.9.23 కోట్ల విలువ చేసే ఎంఎంసీ మత్తు పదార్థాన్ని సీజ్ చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తరలించకుండా జహీరాబాద్ పరిధిలో5, ఖేడ్ పరిధిలో 4 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ డాక్టర్ నవీన్‌చందర్, స్థానిక సీఐ రఘునాథ్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

కోహెడలో రూ.2.66 లక్షల నగదు పట్టివేత



నారాయణరావుపేటలో సీజ్ చేసిన డబ్బులను చూపిస్తున్న అధికారులు

కోహెడ, మే 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గొట్లమిట్ట గ్రామ సమీపంలో కోహెడ, కరీంనగర్ రహదారిపై ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. చింతలపల్లి రమణ అనే వ్యక్తి వాహనంలో రూ.2 లక్షలు, బొమ్మడవేణి శ్రీనివాస్ వద్ద రూ.66 వేలు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు.

నారాయణరావుపేటలో రూ.54,400..

నారాయణరావుపేట, మే 7: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో రూ.54,400 వేలు సీజ్ చేసినట్లు చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ మంగళవారం తెలిపారు. చెక్ పోస్టు వద్ద స్టాటికల్ సర్వేలెన్స్, చెక్ పోస్టు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా సిద్దిపేటకు చెందిన గడగోని వెంకటేష్ ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న డబ్బులను సీజ్ చేశామన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

- ప్రధాని అభ్యర్థిని ప్రకటించలేని దుస్థితిలో కాంగ్రెస్
- సంగారెడ్డి రోడ్‌షోలో బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

సంగారెడ్డి అర్బన్, మే 7: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల అమలును విస్మరించిందని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విమర్శించారు. బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మంగళవారం సంగారెడ్డిలో భారీ బైక్ ర్యాలీతో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ.. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకటి మాత్రమే అమలుచేసి మిగిలిన ఐదు గ్యారంటీలను అమలు చేయలేదన్నారు. ప్రధాని అభ్యర్థిని ప్రకటించలేదని దుస్థితిలో కాంగ్రెస్ ఉన్నదన్నారు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం ఓటింగ్ పూర్తయినా నేటికి కూడా ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి తెలియడం లేదన్నారు. దేశం సుస్థిరంగా ఉండాలన్నా, అభివృద్ధి జరగాలన్నా బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. ముస్లిమైన అబ్దుల్‌కలాం, ఎస్సీ అయిన రామ్‌నాథ్‌కోవింద్, గిరిజన మహిళైన ద్రౌపది ముర్ములను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదేనన్నారు.

కాంగ్రెస్ వస్తే బాంబుల మోత

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్యలో బాబ్రీ మసీదు నిర్మిస్తారని, అంతేకాకుండా కాశ్మీర్‌లో బాంబులు పేలడం మొదలవుతాయని, త్రిపుల్ తలాక్ బిల్లు మళ్లీ రద్దు చేస్తారని ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో కూడా బాంబులు పేలుతాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుపొంది, మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

భవిష్యత్ బాగుండాలంటే బీజేపీని గెలిపించాలి

సిద్దిపేట క్రైం, మే 7: భవిష్యత్ బాగుండాలంటే బీజేపీని గెలిపించాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని 34వ వార్డుకు చెందిన పలువురు యువకులు పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. వారికి మోహన్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. సిద్దిపేట పట్టణంలోని 6వ వార్డులో బీజేపీ మాజీ కౌన్సిలర్ బాసంగారి వెంకట్, కోడూరు నరేష్ ప్రచారం చేశారు. అలాగే సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కమాన్ వద్ద 35, 38వ వార్డుల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సతీమణి మంజుల మంగళవారం సాయంత్రం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాసంగారి వెంకట్, కోడూరు నరేష్, తోడుపునూరు వెంకటేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండల కేంద్రమైన కాళ్లకల్‌లో మండలాధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సంగారెడ్డిలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న అన్నామలై, పక్కన ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

●**నిజాంపేట:** మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో మంగళవారం బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు.

●**చేగుంట:** చేగుంట పట్టణ కేంద్రంలోని 228 బూత్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా పార్టీ మండలాధ్యక్షుడు చింతల భూపాల్, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్ణం గణేష్, బూత్ అధ్యక్షుడు అగల్ దివిటి రవి తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**మాసాయిపేట:** మండల కేంద్రమైన మాసాయిపేటలోని ముత్యాలమ్మ చెరువు వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకెళ్లి బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.



కంగ్టిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

సుస్థిర పాలన కోసం బీజేపీకే పట్టం కట్టండి

- బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్
- బీజేపీలో చేరిన 8 మంది బీఆర్ఎస్ మాజీ సర్పంచులు

కంగ్టి, మే 7: సుస్థిర పాలన కోసం కేంద్రంలో మరోమారు బీజేపీకి పట్టం కట్టండని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్ అన్నారు. మంగళవారం మండలంలోని సిద్ధంగిర్గా, చాప్టా.కె, చాప్టా.బి, నాగూర్.కె, సర్దార్‌తండా, దామర్‌గిద్ద, హోబాతండాలకు చెందిన 8 మంది బీఆర్ఎస్ మాజీ సర్పంచులు బీబీపాటిల్ సమక్షంలో కంగ్టిలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బీబీపాటిల్ మాట్లాడారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఫుడ్ పార్క్ ఏర్పాటుకు తాను కృషి చేస్తే.. కొందరు నాయకులు కుట్ర చేసి.. దీన్ని అడ్డుకోవడంతోనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు నెరవేరలేదన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని, ఈ సారి బీజేపీ ఎంపీగా పువ్వు గుర్తుకు ఓటేసి తనను ఎంపీగా గెలిపిస్తే తప్పకుండా ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీఇచ్చారు. కాగా తాజా మాజీ సర్పంచులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 400ల మంది బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, గంగారాం, నాయకులు ఉమాకాంత్, బస్వరాజ్, వరుణ్‌రాజ్, మధు, దత్తాత్రి పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న బీఆర్ఎస్ మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సిద్దుపాటిల్‌కు కండువా వేస్తున్న బీబీపాటిల్

డబుల్ ఇంజన్లలా పనిచేస్తాం

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, మే 7: తాము డబుల్ ఇంజన్లలా పనిచేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ అన్నారు. మంగళవారం వారు నాయకులు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఖేడ్‌లో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకున్నది. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా.. షెట్కార్ కామారెడ్డిలో ప్రచారం కోసం బయలుదేరారు. ప్రచారం నిర్వహిస్తున్న ప్రాంతం గుండా వెళ్తూ.. తనను ఎంపీగా గెలిపిస్తే ఎమ్మెల్యే, తాను డబుల్ ఇంజన్లలా పనిచేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ అన్నారు. మంగళవారం ఖేడ్‌లోని తన నివాసంలో నాగల్‌గిద్ద మండలం కేశ్వార్‌కు చెందిన మాజీ సర్పంచులు జగ్గప్పలతో పాటు దాదాపు 40 మంది బీఆర్ఎస్ నాయకులు షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఖేడ్ మండలం చల్లగిద్దతండాకు చెందిన మాజీ ఉపసర్పంచ్ రాణానాయక్‌తో పాటు దాదాపు 25 మంది బీఆర్ఎస్ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ చాందిబాయి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మనూరు మండలం పుల్‌కుర్తికి చెందిన 20 మంది బీఆర్ఎస్ నాయకులు పోతుల సంగారెడ్డి, మారుతిరావుల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

సురేష్‌షెట్కార్‌ను గెలిపించాలి

మనూరు, మే 7: కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మనూరుతో పాటు రాణాపూర్, మాయికోడ్, తుమ్నూర్, ముగ్ధంపూర్, దుద్దగొండ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్ పాల్గొన్నారు.

●**రాయికోడ్:** మండల పరిధిలోని సిర్పూర్, దౌల్తాబాద్, శాపూర్, పాంపాడ్, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీనర్సింహులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

●**టేక్మాల్:** మండలంలోని ఎల్లకుర్తి, శేరిపల్లిలో ఎన్ఎస్‌యూఐ మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు.

●**పెద్దశంకరంపేట:** కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెద్దశంకరంపేటలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ఖేడ్‌లో చేతులు కలిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

●**వట్‌పల్లి:** వట్‌పల్లి మండలం పాలడుగులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్‌జోషి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన సుధీర్‌కుమార్

కోహీర్, మే 7: కోహీర్ మండలం చింతలఘట్టు గ్రామానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుధీర్‌కుమార్ సోమవారం రాత్రి సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు చింతలఘట్టు గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్‌కు ఓటు వేయాలి

- కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజలను మోసం చేశాయి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్




మార్నింగ్ వాక్‌లో ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, మే 7: దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు కట్ట వరకు మంత్రి మార్నింగ్ వాక్ చేసి, ప్రజలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే హుస్నాబాద్‌లో నియోజకవర్గ ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని, పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును అవమానపరిచిందన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశామని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందించడంతో పాటు, హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు, మహాసముద్రంగండిని టూరిజం శాఖ క్లస్టర్ కింద అభివృద్ధి చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపినట్లుగానే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపితే మరింత శక్తితో హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలోకి తీసుకుపోతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిందని, ఇప్పుడు కూడా ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రధానంగా మహిళలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, వారిని మరింత చైతన్య పరచాలన్నారు. మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ చేస్తున్న కృషిని వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి భవిష్యత్తు: వీహెచ్

జహీరాబాద్, మే 7: కాంగ్రెస్‌తోనే దేశానికి భవిష్యత్తు ఉన్నదని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో నరేంద్రమోదీ దేశానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. నరేంద్రమోదీ ఏటా రెండుకోట్ల చొప్పున ఉద్యోగాల భర్తీ చేస్తానని, నల్లధనం వెలికితీస్తానని, ప్రజలకు బ్యాంకు ఖాతాల్లో రూ.15లక్షలు చేస్తామని చేసిన హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతూ, దేవుళ్ల పేర్లతో ఓట్లు అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముస్లిం, మైనార్టీల రిజర్వేషన్లు తొలగిస్తామనడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. జహీరాబాద్ ఎంపీగా సురేష్‌షెట్కార్ పోటీ చేస్తున్నందున ఆయన గెలుపు కోసం కష్టపడాలని కార్యకర్తలకు సూచించారు. ఆయనవెంట టీఎస్ఐడీ మాజీ చైర్మన్ మహ్మద్‌తన్వీర్, నాయకులు నవీన్, ఆశప్ప, తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హన్మంతరావు

బెల్టు షాపుపై దాడి.. మద్యం బాటిళ్లు పట్టివేత

తూప్రాన్, మే 7: తూప్రాన్ పట్టణ పరిధి హైవే బైపాస్ రోడ్డులో దాబాల వద్ద నిర్వహిస్తున్న బెల్టుషాపుపై పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో మద్యం బాటిళ్లు పట్టుకొని కేసు నమోదు చేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో ఉన్న దాబాల వద్ద ఓ డబ్బాలో కుమార్ అనే వ్యక్తి మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దాంతో బెల్టుషాపుపై సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు వివరించారు. దాడుల్లో 16 బీర్లు, 90ఎంఎల్ లిక్కర్ బాటిళ్లు 10, 180 ఎంఎల్ లిక్కర్ బాటిళ్లు 9 పట్టుకున్నట్లు వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



పెద్దకోడూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ మధుసూదన్

చిన్నకోడూరు, మే 7: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఏపీడీ మధుసూదన్ కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. మండలంలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య, కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 11న గజ్వేల్‌కు బస్సుయాత్ర

గజ్వేల్, మే 7: ఈ నెల 11న గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పర్యటించనున్నారు. ఈ నెల 10న సిద్దిపేటలో ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని, మరుసటి రోజు తన సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో పర్యటించేందుకు సిద్ధమైనట్లు బీఆర్ఎస్ వర్గాల ద్వారా తెలిసింది.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి

● ఈజీఎస్ జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్

నారాయణరావుపేట, మే 7: ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉపాధిహామీ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని, తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కొలతలకు అనుగుణంగా పనులు చేయాలని, అప్పుడే గిట్టుబాటు కూలీ లభిస్తుందని చెప్పారు. పని ప్రదేశంలో నిడ ఉండేందుకు గ్రీన్ మ్యాట్, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఒక కూలీ పేరుతో మరో కూలీ పని చేయవద్దని, అలాంటి సంఘటనలు ఉంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కూలీలు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఏపీవో నర్సింగావు, నూరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు: రేబర్తిలో ఉపాధిహామీ కూలీల కోసం ఏర్పాటు చేసిన టెంట్



నారాయణరావుపేట: ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఈజీఎస్ జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్

నీడ సౌకర్యం ఏర్పాటు

మద్దూరు, మే 7: ఉపాధిహామీ కూలీలకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు నీడ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ తెలిపారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ మాట్లాడారు. కూలీలు తమ హక్కులను అడిగి సాధించుకోవాలన్నారు. ఎండలు తీవ్రతరం కావడంతో వడదెబ్బ నుంచి రక్షణపొందేందుకు ఉపాధిహామీ కూలీలకు నీడ సౌకర్యం కోసం టెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పనులకు ఉదయం తొందరగా వచ్చి ఎండ తీవ్రత పెరగక ముందే ఇంటికి చేరే విధంగా చూస్తున్నట్లు తెలిపారు. పని ప్రదేశంలో మంచినీళ్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ అయిలయ్యతో పాటు కూలీలు పాల్గొన్నారు.

'సమావేశాన్ని జయప్రదం చేయాలి'



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

గజ్వేల్, మే 7: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు షైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలో నేడు మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని మాదిగ సోదరులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వారివెంట నాయకులు ముక్కపల్లి రాజు, శనిగారి రమేశ్, బోమ్మని మహేశ్, శాంతికుమార్, రాజు, మహేశ్, సతీష్, స్వామి, మహేశ్ తదితరులున్నారు.

వడదెబ్బ నివారణ మందు పంపిణీ

సిద్దిపేట అర్బన్, మే 7 : ఎండలు అధికంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వాసవీవనిత క్లబ్ అధ్యక్షులు మర్యాల వాణి, టీయూడబ్ల్యూజే సహాయ కార్యదర్శి రంగధాంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వాసవీవనిత క్లబ్, అర్బన్ ప్రెస్‌మీడియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలో వడదెబ్బ నివారణ మందు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్నదని, ఈ సమయంలో ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైతే తప్ప మధ్యాహ్నా సమయంలో బయటకు రాకుండా ఉండడమే మంచిదని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సతీష్, వాసవీవనిత క్లబ్ సభ్యులు వీరేశం, రమేష్, సురేష్, అర్బన్ ప్రెస్ క్లబ్ సభ్యులు రమేష్, మహేష్, అరుణ్, శ్రీను, శ్రీకాంత్, జైపాల్, నరేష్ , కేమ్మసారం శ్రీనివాస్, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలి

● ఆర్టీసీ సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్



సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగికి ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, మే 7: ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య క్షేమమే సంస్థ ధ్యేయమని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ పేర్కొన్నారు. గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0 లో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నిత్యం సుమారు వంద మందికి బీపీ, షుగర్, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎం ఉపేందర్ తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతీ ఆర్టీసీ ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన కమిషనర్

జిన్నారం, మే 7: బొల్లారం మున్సిపాలిటీలో పోలింగ్ కేంద్రాలను కమిషనర్ మంగతాయారు పరిశీలించారు. మంగళవారం స్థానికంగా ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ అక్కడ ఉన్న వసతులు, ఇతర సమస్యలపై సమీక్ష నిర్వహించారు.

సాదాసీదాగా వట్‌పల్లి సర్వసభ్య సమావేశం

వట్‌పల్లి, మే 7: వట్‌పల్లి మండల సర్వసభ సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో పలువురు అధికారులు సభకు గైర్హాజరయ్యారు అదేవిధంగా ఎంపీటీసీలు ముగ్గురు మినహా మిగతా ఎంపీటీసీలు హాజరు కాలేదు దీంతో సభకు వచ్చిన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పత్రి అపర్ణ, ఎంపీడీవో శశిప్రభ, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు

బీడీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా కోట

గజ్వేల్‌టౌన్, మే 7: గజ్వేల్ నియోజకవర్గ బీడీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా కోట కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో బీడీ యజమానుల సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం బీడీ యజమానులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పులుగం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బోనాల రాజేశం, కార్యదర్శిగా చిలుక చంద్రమౌళి, కోశాధికారిగా గోవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గజ్వేల్ బీడీ యజమానుల సంఘం సలహాదారులు పేర్ల నర్సింహులు, పోచయ్య అశోక్, నరేందర్, వెంకటేశం, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ల అప్పగింత

పెద్దశంకరంపేట, మే 7: పెద్ద శంకరంపేట మండల పరిధిలోని రామోజీపల్లి గ్రామానికి చెందిన చిట్టిబోయిన శ్రీకాంత్, చిట్టబోయిన మహేష్ తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో మంగళవారం పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.ఎవరైనా వారి సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నట్లయితే వెంటనే సెల్‌ఫోన్ వివరాలతో పాటు ఆధార్ కార్డు తదితర వివరాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు.

కానిస్టేబుల్ మృతిపై ఎస్పీ సంతాపం

సంగారెడ్డి క్రైం, మే 7: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన యాదగిరి అకాల మరణం పట్ల జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సంతాపం ప్రకటించారు. యాదగిరి 2013లో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వులో పోలీసు కానిస్టేబుల్‌గా నియామకమై ఉమ్మడి మెదక్ జిల్లాలో సేవలందించారు. అనారోగ్యంతో కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. పోలీస్ శాఖ తరపున మృతుడి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందేలా చూస్తామని ఎస్పీ రూపేష్ హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.20వేలు యాదగిరి కుటుంబానికి అందజేశారు.

పాము కాటుకు మహిళ మృతి

హత్నూర, మే 7: మండలంలోని గోవింద్రాజ్‌పల్లి గ్రామంలో మంగళవారం ఉదయం పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. గోవింద్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మోదుగుల అనుసూజ(56) ఇంటి బాత్రూం వద్ద పాముకాటుకు గురైంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికితరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆలయంలో చోరీ

నిజాంపేట, మే 7: మండలంలోని చల్మెడ గ్రామం పెద్దమ్మ ఆలయంలో హుండీని పగులగొట్టి వస్తువులు, నగదును దొంగిలించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన పెద్దమ్మ ఆలయంలో హుండి పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. ఇట్టి విషయంపై ముదిరాజ్ కులానికి సంబంధించిన సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించడమైందని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

డబ్బు రాజకీయాలను తిప్పికొట్టాలి

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, మే 7: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి డబ్బు రాజకీయాలకు తెరలేపి, ప్రజాస్వామ్యయుతంగా సాగాల్సిన ఎన్నికలను అవినీతిమయం చేస్తున్నారని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. ఈమేరకు మంగళవారం చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతాప్‌రెడ్డి తన ఇంటిని కేంద్రంగా చేసుకుని విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న విషయమై ఎన్నికలసంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు కొంగరి వెంకట్‌మావో, అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్, ముస్యాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఏం చేస్తారో ప్రకటించాలి

● బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రవీందర్‌గౌడ్

హుస్నాబాద్‌రూరల్, మే 7: పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోదీ బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు పెంచలేదని, తెలంగాణ జిల్లాల్లో పర్యటిస్తున్న ఆయన బీసీలకు ఏం న్యాయం చేస్తారో ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం, రైతు సంఘాల ఐక్య వేదిక నియోజకవర్గ నాయకుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలకు 5 శాతం ఉన్న రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారని, మెజార్టీ వర్గమై బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో ప్రధాని తన పర్యటన సందర్భంగా బీసీలకు ఏమి న్యాయం చేస్తారో ప్రకటించాలని, లేని పక్షంలో బీజేపీకి వ్యతిరేకంగా బీసీలందరూ ఓటు వేస్తారని హెచ్చరించారు.

బసు సర్వీసులను పునరుద్ధరించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేశం

హుస్నాబాద్‌రూరల్, మే 7: మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థం నడిపిస్తున్న బస్ సర్వీసులను డిపో మేనేజర్ రద్దు చేయడంతో, ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రద్దు చేసిన బసు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిపె మల్లేశం డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండలం మాలపల్లి, కృన్నపేట మండలం బొడిగెపల్లి, గౌరవెల్లి, కుందనవానిపల్లి, నందారం మీదుగా రామవరం, దూలిమిట్ట, కొండాపూర్‌కు రెగ్యులర్‌గా నడిచే బస్‌సర్వీసును రద్దుచేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బస్సుసర్వీసులను పునరుద్ధరించడంతో పాటు డిపోకు అదనంగా కొత్తబస్సులు తీసుకు వచ్చేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని సీపీఐ నాయకులు గడిపె మల్లేశం, అయిలేని సంజీవరెడ్డి కోరారు.

ఎన్‌సీసీ కెప్టెన్ శిక్షణ పూర్తి చేసిన భవానీ



భవానీని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గజ్వేల్, మే 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఎం.భవానీ ఎన్‌సీసీలో కెప్టెన్ శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. కమాండెంట్ నుంచి కెప్టెన్‌గా పదోన్నతి పొందడం పట్ల ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ అధికారిగా 2014లో లెఫ్టినెంట్ శిక్షణను పూర్తి చేసుకున్నానని, పదేళ్ల పూర్తి అయిన సందర్భంగా ఎన్‌సీసీ పదోన్నతికి కావాల్సిన కోర్సును మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని ఎన్‌సీసీ ట్రైనింగ్ అకాడమీలో పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. శిక్షణను పూర్తి చేసుకోవడానికి సహకరించిన కళాశాల బృందానికి, సంగారెడ్డి బెటాలియన్ అధికారులకు, తన కుటుంబసభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'సర్పంచులు కాంగ్రెస్‌లో చేరడంలేదు'

దౌల్తాబాద్, మే 7: దౌల్తాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 12 మంది తాజా మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరుతున్నారని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సయ్యద్ రహీమోద్దీన్, మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొమ్మెర పూజీత వెంకటొరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో 12 మంది మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిదులు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీపీ సంధ్య రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటొరెడ్డి, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, ఆయాంగారి నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, చిత్తారిగౌడ్, అప్పవారు శ్రీనివాస్, లతామధుసూదన్‌రెడ్డి, యాదగిరి, మల్లేశం, రాజు తదితరులు ఉన్నారు.

బెల్టుషాపుపై దాడి

సిద్దిపేట క్రైం, మే 7 : సిద్దిపేట పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇమాంబాద్ గ్రామంలో పిల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి తన హోటల్లో అక్రమంగా బెల్ట్ షాపు నడిపిస్తున్నాడు. ఈ విషయమై విశ్వసనీయ సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు దాడి చేసి విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, సిబ్బంది ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● ఎంపీపీ లకావత్ మానస



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లకావత్ మానస

హుస్నాబాద్‌రూరల్, మే 7: గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ లకావత్ మానస పేర్కొన్నారు. ఎంపీపీ మానస అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ప్రత్యేకాధికారులు పనిచేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిర్మల, ఎంపీడీవో, తహసీల్దార్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మండలాభిషేకం



చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, మే 7: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ప్రతిష్ఠ గావించుకుని 40రోజులు పూర్తయినందుకు గాను, మంగళవారం మండలాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం చంద్రమౌళీశ్వర స్వామి వారికి ఆలయ వేద పండితులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి దర్శనంతో పాటు క్షేత్రంలోని విద్యాసరస్వతీ, లక్ష్మీగణపతి, శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ భోజన వసతిని కల్పించారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

బీఆర్ఎస్ హయాంలోనే అందరికీ సంక్షేమ పథకాలు

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు

మర్కుక్, మే 7: రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీఎం కేసీఆర్ అందించారని, ఇప్పుడు కాంగ్రెస్ 5 నెలల పాలన చూసి ఎవరు అభివృద్ధి, సంక్షేమం పాలన చేశారో ఆలోచించి, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. మండల కేంద్రమైన మర్కుక్‌తో పాటు వరదరాజ్‌పూర్, దామరకుంట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం తెచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని, ఆయన చేసిన పదేళ్ల పాలనలో రైతులకు, నిరుపేదలకు అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందయని అన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డిలతో బీఆర్ఎస్ శ్రేణులు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెరా నరేశ్, తాజా మాజీ సర్పంచులు బాస్కర్, ప్రవీన్, గాయత్రి బాల్‌నర్సయ్య, మ్యాకల కనకయ్య. రాందాస్ గౌడ్, సంతోష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాబుయాదవ్, అంజనేయులు, తదితరులు ఉన్నారు.

నూతన పోస్టల్ ఓటు హక్కు విధానం భేష్

● యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ

గజ్వేల్, మే 7: మే 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు, తీసుకువచ్చిన నూతన పోస్టల్ బ్యాలెట్ విధానం బాగుందని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు వి.సత్యనారాయణ హర్షం వ్యక్తంచేశారు. గజ్వేల్ పట్టణంలోని ఐటీసీలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాత విధానంలో గెజిటెడ్ సంతకం చేయించడం వల్ల ఇబ్బందులకు గురయ్యారని, నిబంధనలు మార్చి నూతన విధానం తీసుకురావడంతో, ఉద్యోగి పనిచేస్తున్న ప్రదేశంలోనే ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం బాగుందన్నారు. ఎన్నికలకు నాలుగు రోజులు ముందే వినియోగించుకునే వీలు కల్పించడంతో ఎన్నికల విధులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవన్నారు.



గజ్వేల్ పట్టణంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయులు

సదాశివపేటలో కేంద్ర బలగాలతో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

సదాశివపేట, మే 7: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సదాశివపేట పట్టణంలో సీఐ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్రబలగాలతో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలకు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చేసేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భరోసానిస్తూ, పోలింగ్ ప్రశాంతంగా నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సంఘం ఉత్తర్వులను ఎవరూ ధిక్కరించినా చర్యలు తప్పవన్నారు. ఎన్నికల వేళ నిబంధనలు ఉల్లంఘించేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.



సదాశివపేటలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు